సూర్య
నేటి దినపత్రిక
తూర్పు గోదావరి
బుధవారం | ఫిబ్రవరి 20, 2019 | పేజీలు 8

# విశ్వవిద్యాలయాలకు భరోసా...రూసా

- పరిశోధనలకు...మౌలిక సదుపాయాలకు కేంద్ర సాయం
- రూ.20కోట్లతో కో-ఆర్డినేటర్ ప్రసాదరాజు సారధ్యంలో ప్రణాళిక


రూసా కోఆర్డినేటర్ ప్రసాదరాజు


జెఎన్‌టియుకె రిజిస్ట్రార్ సుబ్బారావు


జెఎన్‌టియుకె విసి రామలింగరాజు

**మేజర్‌న్యూస్, కాకినాడ :** భావి భారత విజ్ఞానులను, పరిశోధకులను, నిర్మాణ సారధులను తయారు చేసే విశ్వ విద్యాలయాలకు కేంద్ర ప్రభుత్వం భరోసాగా ప్రకటించిన ప్రత్యేక పథకం రూసా. కేంద్ర ప్రభుత్వం 2013లో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సారధ్యంలో విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఇది కేంద్రీకృత ప్రాయోజిత పథకం. రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్షా అభియాన్‌గా పిలిచే ఈ రూసాకు విస్తృతమైన వ్యవస్థీకృత లక్ష్యాలున్నాయి. విశ్వవిద్యాలయాలను ■ మిగతా 2లో

# విశ్వవిద్యాలయాలకు భరోసా...రూసా

కేటగిరిగా విభజించి 60:40 నిష్పత్తిలో కొన్నింటిని 90:10 నిష్పత్తిని, మరికొన్నింటిని యూనియన్ భూభాగాలలో ఉండే విశ్వ విద్యాలయాలకు 100 శాతంతో నిధులను కేటాయించడం రోసాలో ప్రధాన అంశం. అందుకు అవసరమైన ప్రతిపాధనలను ఆయా విశ్వ విద్యాలయాలనుంచి రప్పించుకోవడం ద్వారా నిధులను క్లిష్టతర సమీక్షా పరిశీలన పరీక్షానంతరం అవసరాలను మదింపు చేసి నిధులను కేటాయించడం రూసా ప్రత్యేకత. అటువంటి ప్రత్యేకతలున్న రూసాకు జెఎన్‌టియుకె పంపించిన ప్రతిపాధనలు నచ్చడంతో రూ.20 కోట్లను కేటాయిస్తూ అనుమతులు మంజూరు చేసింది. జెఎన్‌టియుకె మాజీ రిజిస్ట్రార్, పీజీఈసెట్ మాజీ కన్వీనర్ ప్రసాదరాజును విశ్వవిద్యాలయం రూసా విభాగానికి కన్వీనర్‌గా నియమించారు. విసి రామలింగరాజు, ప్రస్తుత రిజిస్ట్రార్ సుబ్బారావు సూచనలతో సమగ్రమైన విశ్లేషణాత్మక మౌళిక సదుపాయాల కల్పన అంశాలతో ఆర్ధిక నివేదికను తయారు చేసేందుకు ప్రసాదరాజు కసరత్తు చేస్తున్నారు. రూసా ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం నూతన నిర్మాణాలకు రూ.10కోట్లను మరమత్తులు ఇతర సవరణలకు రూ.4కోట్లు, పరికరాలు, పరిశోధనాంశాలు, కంప్యూటర్లు తదితరాలకు రూ.6కోట్లతో సమగ్ర నివేదిక రూపకల్పనలో ప్రసాద రాజు నిమగ్నమయ్యారు. దేశంలోనే అత్యంత శ్రేష్టమైన ఉన్నత విద్యా సంబంధిత ప్రత్యేక ప్రోత్సాహక అభివృద్ధి పథకంగా రూసాను అభివర్ణించవచ్చు. వివిధ రాష్ట్రాలలోని స్వాతంత్ర ప్రతిపత్తిని కల్పించడం ద్వారా విశ్వవిద్యాలయాలను ఆర్ధికంగా ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యం. అదే సమయంలో రాష్ట్రాల స్థాయిలో సంస్థాగత ప్రణాళికను రూపొందించి అమలు చేయడం రూసా తగిన విధంగా సాయాన్ని అందిస్తుంది. అనుబధం, విద్యా విషయక, పరీక్షా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం కూడా రూసా సహాయానికి కొలమానంగా చెప్పుకోవచ్చు. అన్ని స్థాయిల్లోనూ అధ్యాపకులను అందించడం ద్వారా విద్యార్ధులను తీర్చి దిద్దడం కూడా ఇందులో భాగమే. ముఖ్యంగా ప్రాంతీయ అసమానతలు ఉన్న ప్రాంతంలో కూడా రూసా ఏర్పాటుతో ఆ అసమానతలను తగ్గించేందకు కృషి జరగుతుంది. ఎస్సీ, ఎస్టీలకు, సామాజికంగా విద్యాపరంగా వెనుకబడి ఉన్న తరగతులకు విద్యను అందించడం, మహిళలు, మైనార్టీలను, భిన్నంగా ఉన్నవారిని ఉన్నత విద్యకు ప్రోత్సహించడంలో రూసా కీలక పాత్ర వహిస్తుంది. విశ్వవిద్యాలయాలకు ఉన్న స్వాతంత్ర కళాశాలల(అటానమస్) స్థాయిని పెంచడం, క్లస్టర్ విశ్వ విద్యాలయాలకు కళాశాలలను మార్పిడి చేయడం, నిపుణుల సారధ్యంలో కొత్త కళాశాల ఏర్పాటు, పరిశోధన ఆవిష్కరణ, నాణ్యతాభివృద్ధి, కార్యక్రమాలను రూపొందించి అమలు చేయడం, ఫ్యాకల్టీ నియామకం, సంస్థాగత పునర్నిర్మాణం వంటి కీలక అంశాలకు, రీడర్‌షిఫ్ డవలప్‌మెంట్‌కు రూసా సహకరిస్తుంది. అయితే జెఎన్‌టియుకె మాత్రం రూ.20 కోట్లతో ప్రధానంగా మౌళిక సదుపాయాల్లో నూతన నిర్మాణాలు మరమ్మత్తులు ఎక్విప్‌మెంట్లకు, కంప్యూటర్లు కొనుగోలుకు మాత్రం నిధులను నిర్ధేశిస్తూ ప్రాజెక్టు రిపోర్టును రూపొందిస్తుంది. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే జెఎన్‌టియుకెలో నూతన మార్పులకు అవకాశం కలగవచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉపకులపతి రామలింగరాజు, రిజిస్ట్రార్ సుబ్బారావు, రూసా కో-ఆర్డినేటర్ ప్రసాదరాజుల సమిష్టి కృషి ఫలించడం ద్వారా జెఎన్‌టియుకెకు నూతన సొబగులు ప్రకాశించే అవకాశం ఉంది.